క్లుప్తంగా

విద్యార్థులకు కిట్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మోడల్, కస్తూర్బా పాఠశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాల కిట్లు మంజూరైనట్లు ఎంఈఓ–టూ గౌస్‌పీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో 240 మంది, కస్తూర్బా బాలికా విద్యాలయంలో 40 మంది విద్యార్థులకు కిట్లు మంజూరు కాగా వాటిని గురువారం పంపిణీ చేసామని తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ సుబ్బరాయుడు

తంబళ్లపల్లె: ఉత్తమ ఫలితాలు సాధించేందుకు టీచర్లు సమిష్టిగా కృషి చేయాలని ఎంఈఓ–2 నాగసుబ్బరాయుడు కోరారు. గురువారం కోటకొండ యూపీ పాఠశాలలో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. టీచర్ల పనితీరుపై హెచ్ఎం సురేంద్రబాబును ఆరా తీశారు. తరగతుల్లో పిల్లల్లో అభ్యసన స్థాయి గుర్తించేందుకు పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

వనరుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రసంగిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ రెడ్డిరాణి

పీలేరు రూరల్: ఉమ్మడి వనరుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఈఎస్ (ఫౌండేషన్ ఫార్ ఎకలాజికల్‌సెక్యూరిటీ)స్వచ్ఛందసంస్థ జిల్లా కోఆర్డినేటర్ రెడ్డి రాణి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల స్థాయి సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి వనరుల పునరుద్ధరణ చేపట్టకోవడానికి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వార రైతుల పొలాలలో, చెరువులు, కొండలను, శ్మశాన వాటికలు, పశుగ్రాసాన్ని పెంచుకోవడం, భూమి చదును తదితర పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మహేశ్వర్, ఏపీఎం లక్ష్మిరెడ్డి, ఎఫ్ఈఎస్ కో ఆర్డినేటర్ జానకి, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే అధిక ఓఆర్

మదనపల్లె సిటీ: అందరి కృషితోనే ఆర్టీసీ వన్ డిపో జులై నెలలో ఓఆర్ 72.28 సాధించి రీజియన్‌లో మొదటి స్థానం నిలిచిందని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డిపో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరు నెలలుగా డిపోలో మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. కేఎంపీఎల్‌లో 5.41 సాధించి రెండో స్థానం నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన




వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి: కేవీకే పరిధిలోని కలికిరి, వాల్మీకిపురం మండలాల పరిధిలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ కె. మంజుల శాస్త్రవేత్తలతో కలిసి వేరుశనగ, టమాటా, వంగ, వరి పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేరుశనగ పంట పూత దశకు చేరుకుందని, నీటి సదుపాయం ఉన్నవారు నీటి తడి ఇవ్వాలని, ఎకరానికి 200 కిలోల జిప్సం పొడి చేసి వేయాలని సూచించారు. వరి, వంగ పంటల సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సోము శేఖర్‌బాబు, పీరా సాహెబ్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

4న షూటింగ్‌బాల్ జట్టు ఎంపిక

పీలేరు రూరల్: షూటింగ్‌బాల్ జిల్లా జట్టును ఈ నెల 4న ఎంపిక చేస్తామని జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. గురువారం పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ 4వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు అన్నమయ్య జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జట్టును పీలేరులోని శ్రీభువన విద్యాలయంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధృవీకరణపత్రం, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. సమాచారం కోసం సెల్ నంబర్ 6281881022ను సంప్రదించాలని సూచించారు.

ఈఈని కలిసిన నాయకులు



ఈఈని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఓసి అసోసియేషన్ నాయకులు

మదనపల్లె సిటీ: విద్యుత్‌శాఖ మదనపల్లె డివిజన్ నూతన ఈఈ గంగాధరంను గురువారం ఆ శాఖ ఓసి అసోసియేషన్ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. డివిజన్‌లోని విద్యుత్ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ యూనియన్ కార్యదర్శి శేషాద్రి నాగరాజు, నాయకులు రఘు, శ్రీనివాసులు, శ్రీపతి, హరినాథ్‌రెడ్డి, శివమూర్తి, రవీంద్రనాథ్‌రాజు, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టు సడలిన వ్యాపారం

- కుదేలైన పట్టుచీరల వ్యాపారం
- శుక్రమూఢ్యం, ఆషాడం ఎఫెక్ట్
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- శ్రావణ మాసం, పెళ్లిళ్ల సీజన్‌పైనే ఆశలు



వ్యాపారాలు లేక బోసిపోయిన నీరుగట్టువారిపల్లెలోని సిల్క్‌హౌస్‌లు

మదనపల్లె సిటీ: నీరుగట్టువారిపల్లె పట్టు చీరల మార్కెట్‌కు రాష్ట్రంలో పేరుగాంచింది. నిత్యం వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ ఉండేది. కానీ నేడు కొనుగోలుదారులు లేక వెలవెలబోతోంది. శుక్రమూఢ్యం, ఆషాడం వల్ల శుభకార్యాలు లేకపోవడంతో పట్టు చీరల అమ్మకాలు మందగించాయి. మదనపల్లె(నీరుగట్టువారిపల్లె)లో ఏ షాపులో చూసినా పట్టుచీరల నిల్వలు పేరుకుపోయాయి. దీంతో వ్యాపారులు శ్రావణం, మాఘమాసంలో జరిగే శుభకార్యాలపైనే ఆశలు పెట్టుకున్నారు.

బోసి పోతున్న దుకాణాలు

పట్టుచీరలు మిలమిల మెరిసిపోతున్నా... కొనుగోలుదారులు లేక దుకాణాలు బోసి పోతున్నాయి. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో సుమారు 500కు పైగా పట్టుచీరల దుకాణాలు (సిల్క్‌హౌస్‌లు) ఉండగా మూడు నెలలగా ఎక్కడ చెప్పుకోదగ్గ వ్యాపారం జరగడం లేదు. ఇతర రాష్ట్రాల వ్యాపారులూ ఆన్‌సీజన్‌లో నీరుగట్టువారిపల్లెకు రాకపోవడంతో అనుబంధ రంగాల్లోని వారికీ ఉపాధి కరువైంది. నీరుగట్టువారిపల్లె సిల్క్‌హౌస్‌ల యజమానులు కావాల్సిన డిజైన్లలో చీరలు నేయించుకుంటారు. అంతేకాకుండా సొంతంగా మగ్గాలపై చీరలు నేయించి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. చేనేత మగ్గంపై తయారైన పట్టుచీరలలు రూ.5 వేల నుంచి రూ.లక్ష, రూ.2 లక్షల వరకు ధరలు ఉంటాయి. ఈ చీరలను పొరుగు రాష్ట్రాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, కంచి, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి నగరాల్లోని పట్టుచీరల షోరూంలకు హోల్‌సేల్‌గా అమ్ముతారు. అలాగే తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల వ్యాపారులూ నీరుగట్టువారిపల్లెకు వచ్చి పట్టుచీరలు కొనుగోలు చేస్తారు.

మందకొడిగా అమ్మకాలు

నీరుగట్టువారిపల్లెలో పట్టుచీరల అమ్మకాలు మూడు నెలలుగా ఆశించిన స్థాయిలో జరగడం లేదు. శుభకార్యాలకు మంచి ముహూర్తాలు లేక పోవడం, శుక్రమూఢ్యం, ఆషాడమాసం కారణంగా పట్టుచీరల విక్రయాలు బాగా తగ్గిపోయాయి. సీజన్‌లో ప్రతి వారం రూ. రెండు కోట్లుకు పైగా లావాదేవీలు జరిగేవి. ప్రస్తుతం ఇందులో 10 శాతం కూడా జరగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పట్టుచీరలన్నీ స్టాక్ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో సమయానికి కార్మికులు డబ్బులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

ముహూర్తాల సీజన్‌పైనే ఆశ

రానున్న శ్రావణం, మాఘమాసం, దసరా, దీపావళి పండుగలపై వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. ఎప్పటిలాగే ఈ సీజన్‌లో పట్టుచీరల విక్రయాలు జోరందుకుంటాయని అంచనా వేస్తున్నారు. దీనికి తోడు ఈ ఏడాది పంటలు బాగా పండితే పట్టుచీరల వ్యాపారం గాడిలో పడే అవకాశం ఉంది.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



ఆన్‌సీజన్‌వలన మూడు నెలలుగా పట్టుచీరల అమ్మకాలు తగ్గాయి. ప్రభుత్వం సొసైటీల ద్వారా ఆన్‌సీజన్‌లోనూ పట్టు ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుంది. వ్యాపారులకు పరిశ్రమల శాఖ నుంచి రాయితీ రుణాలు ఇవ్వాలి. అప్పుడు పరిశ్రమ గాడిలో పడుతుంది. చేనేత కార్మికులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పట్టుచీరల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.

–దండు రామాంజులు, పట్టుచీరల వ్యాపారి, నీరుగట్టువారిపల్లె

చీరల ఉత్పత్తి తగ్గింది



వ్యాపారం చాలా ఇబ్బందిగా ఉంది. చేనేత సంక్షోభం కారణంగా పట్టుచీరల ఉత్పత్తి తగ్గింది. ఆన్‌సీజన్‌తో పెట్టుబడి స్తంభించిపోయింది. ప్రభుత్వం స్పందించి పట్టుచీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపాలి. పట్టు చీరల వ్యాపారులకు రాయితీలు ఇవ్వాలి.

–సుధాకర్, చేనేత కార్మికుడు, నీరుగట్టువారిపల్లె

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిమ్మనపల్లె : ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రకటించారు. గురువారం మండలంలోని ఆచార్లపల్లె, ఎర్రాతివారిపల్లె, బండ్లపై గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచి 4వేల రూపాయలకు పెంచిన పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి హామీని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాచవేటివారిపల్లె సర్పంచ్ సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ రెడ్డప్పరెడ్డి, ఎంపీడీఓ షాలేట్, డీటీ తపస్విని, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల్లో చైతన్యం రావాలి

మదనపల్లె సిటీ: మైనార్టీల్లో విద్యా చైతన్యం రావాలని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో టెట్ ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం షాజహాన్, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, హుమయూన్, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చెంబకూరు, పెద్దకురప్పల్లి గ్రామాల్లో..

రామసముద్రం : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. గురువారం ఆయన కాప్పల్లి, చెంబకూరు, పెద్దకురప్పల్లి గ్రామాల్లో పెంఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి, సంబంధించిన అధికారులను పరిష్కరించాలంటూ ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ కార్యదర్శి యమలా సుదర్శనం

మదనపల్లె : మాలలు అందరూ ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి యమల సుదర్శనం పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అనేది రాష్ట్రాలకు అధికారం లేదని పార్లమెంట్ 1/3 వంతు ఆమోదం తెలపాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని పట్టించుకోవడం లేదని, ఎస్సీలను విడగొట్టి వర్గీకరణ చేస్తామంటోందని తప్పుబట్టారు. 341 ఆర్టికల్ ప్రకారం ఆర్టికల్ 14 ప్రకారం వర్గీకరణ జరగదని స్పష్టం చేశారు. వర్గీకరణ అంశం చాలా సున్నితమైనదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ విమల చంద్రయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్,మల్లెల మోహన్, బత్తిన మోహన్, మాణిక్యం, రామచంద్ర, కృష్ణప్ప పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు



పింఛన్లు పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి నిస్సార్, వీఆర్వో అన్వర్

గుర్రంకొండ: లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తామని పంచాయతీ కార్యదర్శి నిస్సార్ అహ్మద్, వీఆర్వో అన్వర్ తెలిపారు. గురువారం పట్టణంలోని అన్ని వీధులతో పాటు ఇందిరమ్మకాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు నవాజ్, శిరిష, సుధీర్, ఫిరోజ్ పాల్గొన్నారు.

98 శాతం పంపిణీ

తంబళ్లపల్లె: మండలంలో గురువారం 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఏ కృష్ణమూర్తి, ఏఓ ఆనందకుమార్ తెలిపారు. 6,265 మంది పింఛన్‌దారులకు 6,120 మందికి సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షణ అధికారుల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు



పీలేరులో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు



బి.కొత్తకోటలో సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో గురువారం ఎంఆర్‌పీఎస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును తామంతా స్వాగతిస్తున్నామన్నారు. పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ చేపట్టిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితం కారణంగా సుప్రీంకోర్టు ఏ.బీ.సీ.డీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు.

పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

పీలేరు రూరల్: పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మెస్పీ జిల్లా నాయకులు ఎస్.సుధాకరబాబు అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై ఎమ్మార్పీస్, ఎమ్మెస్పీ నాయకులు కలిసి బాణసంచా పేల్చి, కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య, ప్రేమ్‌కుమార్, తిమ్మయ్య, శ్రీకాంత్, అశోక్ విజయ్‌కుమార్, ప్రసాద్, కొండయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల హర్షం

తంబళ్లపల్లె: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం హరిత సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు బాణ సంచా పేల్చుతూ నినాదాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, బాస్ నాయకులు గురువారం బి.కొత్తకోటలో సంబరాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు (చిన్న) మాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాలు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన పోరాటాలకు ఫలితం దక్కిందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, పలక రవి, తోలు ఆంజనేయులు, వెంకటరమణ, ఓబులేసు, గంగులప్పా రామంజులు పాల్గొన్నారు.

విధుల నుంచి తప్పుకున్న ఫీల్డ్ అసిస్టెంట్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శేషాద్రి గురువారం విధుల నుంచి తప్పుకున్నారు. వ్యక్తిగత కారణాల వలన తాను విధుల నుంచి తప్పుకుంటున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మానంద రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఏపీవీబీఎస్ అధ్యక్షుడిగా మధు

తంబళ్లపల్లె: రాష్ట్ర వాల్మీకి, బోయ సంఘం మండల అధ్యక్షుడిగా పరసతోపు పంచాయతీ బోయపల్లికు చెందిన మధును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ వాల్మీకి బోయల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా నాగశివారెడ్డి

గుర్రంకొండ: గుర్రంకొండ ఇన్‌చార్జి ఎంపీడీఓగా నాగశివారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న జగదీశ్వర్‌రెడ్డి గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న నాగశివారెడ్డిని ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

117 జీఓను రద్దు చేయాలి

లక్కిరెడ్డిపల్లి: ప్రభుత్వ పాఠశాలకు గుదిబండగా మారిన జీఓ నంబర్ 117ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని టీఎస్‌యూఎస్ ఉపాధ్యాయ సంఘం సంజీవరెడ్డి, కార్యదర్శి వీరాంజనేయులు, ప్రదాన కార్యదర్శి రామచంద్ర పేర్కొన్నారు. ఈమేరకు గురువారం రవాణా క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.


పాఠశాలల్లో ఎన్నికలకు నోటిఫికేషన్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న చైర్మన్, వైస్ చైర్మన్ల పదవీ కాలం ముగియడంతో నూతన ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంఈఓ నారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్, కస్తూర్బా పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 1న నోటీస్ బోర్డులో ఓటరు జాబితాను ప్రదర్శించారన్నారు. ఈ నెల 5న అభ్యంతరాల స్వీకరణ పరిష్కరించి జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారన్నారు. 8న ఎన్నికల పోలింగ్ తర్వాత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులచే చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుని అదే రోజు మొదటి కమిటీ సమావేశం నిర్వహించేలా ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చామని ఎంఈఓ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

పురాతన ఇళ్ల గోడలపై చెట్లు మొలచి పెద్దవి అవుతుండదంతో ప్రమాదం పొంచి ఉంది. గుర్రంకొండ పట్టణం కొత్తపేటవీధి, ఎస్ఎల్‌టీ వీధుల్లో మూడు చోట్ల గోడలపైన రావిచెట్లతో పాటు ఇతర చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో ఇంటిగోడలు చీలికలు ఏర్పడ్డాయి. గోడలు ఎక్కువగా చీలిపోయి ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గాల్లో నిత్యం జనసంచారంతో పాటు పిల్లలు పాఠశాలలకు వెళుతుంటారు. అధికారులు చొరవ తీసుకుని పురాతన భవనాలను కూల్చాలని కోరుతున్నారు.

–గుర్రంకొండ



గుర్రంకొండలో ఇంటి గోడలపై మొలచిన రావిచెట్టు

మొరాయించిన తారు రోడ్డు మిషన్

- భారీగా ట్రాఫిక్ జామ్
- ఇబ్బంది పడిన ప్రయాణికులు



రోడ్డు మిషన్‌ను క్రేన్ సాయంతో పక్కకు తొలగిస్తున్న దృశ్యం

కురబలకోట: అంగళ్లు విశ్వం కళాశాల నుంచి అంగళ్లు–మదనపల్లి మార్గంలో ఇరువైపులా గురువారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. అంగళ్లు మార్గంలోని విశ్వం కళాశాల వద్ద హైవే తారు రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. తారు రోడ్డు వేసే మిషన్ ఉన్నట్టుండి మరమ్మతుకు గురైంది. దీంతో రోడ్డుకు ఇరువైపులా బారులు తీరి వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు భారీ క్రేన్ల సాయంతో మిషన్‌ను పక్కకు తొలగించారు. అప్పటికే ఐదు కిలోమీటర్ల ఆగిపోయిన బస్సులు, లారీలు, అంబులెన్స్‌లు ఇతర ఇతర వాహనాలను కొత్త బైపాస్ మీదుగా మళ్లించారు. ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఉచిత వైద్య పరీక్షలు

వాల్మీకిపురం: శ్రీ షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 95 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 20 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ కీర్తన తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని సభ్యులు తెలిపారు. నాయకులు శివానంద రెడ్డి, నీళ్ల భాస్కర్, కేశవరెడ్డి, వైద్య సిబ్బంది దిలీప్ పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా



వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

వాల్మీకిపురం: రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గండబోయనపల్లి, చింతపర్తి, వాల్మీకిపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. నమ్మకంతో భారీ మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, నాయకులు మల్లికార్జున రెడ్డి, చంద్రమౌళి, రాజేంద్రాచారి, గాంధీపేట రమణ, మురళి, కేకే, ఆదినారాయణ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పీలేరు : స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌లు, అధికారులు పంచాయతీ నిధులను వారి సొంతవాహనాలకు వినియోగించుకున్నారని తెలిపారు. సర్పంచ్‌లు తమ డ్రైవర్లుకు జీతాలు పంచాయతీ నుంచి విడుదల చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. గురువారం పీలేరు పట్టణంలోని మోడల్‌కాలనీ, అజంతమిట్ట, లక్ష్మీపురం ప్రాంతాలలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

తల్లిపాలు అమృతతుల్యం



వాల్మీకిపురం: ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ భారతి



పీలేరు : తలపులలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి, తదితరులు

కేవీపల్లె: తల్లిపాలు అమృతతుల్యమని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు బిడ్డకు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని జిల్లేజుళ్లమంద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దేవాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముర్రుపాలు జీర్ణశక్తి పెరుగుదలకు ఉపయోగపడుతాయని తెలిపారు. పాలు ఇచ్చే తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ రాదని పేర్కొన్నారు. ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

రామసముద్రం: తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని రామసముద్రం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా తెలిపారు. గురువారం కేసీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలపై బిడ్డల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలే పట్టించాలని సూచించారు. ముర్రుపాలు తాపడం వలన బిడ్డకు మేధాశక్తి పెరగడంతో పాటు శారీరక దృఢత్వం వస్తుందన్నారు. బిడ్డ తల్లులు కూడ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహరం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య , అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలతో ఆరోగ్యం

కలకడ : తల్లి పాలతో బిడ్డలకు ఆరోగ్యంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ముడియంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరత్నమ్మ, కనకమ్మ, భాగ్యమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు.

ముర్రుపాటు బిడ్డకు రక్ష

వాల్మీకిపురం: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని స్థానిక సీడీపీఓ భారతి సూచించారు. గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలనే పట్టించాలని సూచించారు. ఆరు మాసాలు పూర్తి అయిన తరువాత అనుబందాహారం బిడ్డకు మొదలు పెట్టాలన్నారు. అనుబందాహారం ఇస్తూనే తల్లిపాలను రెండేళ్ల పాటు ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే నాయక్‌వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు.హెచ్ఎం శ్రీదేవి, పీడీ ఉమాదేవి, సూపర్‌వైజర్ రోహిణి, వైద్య సిబ్బంది అమృత, కృష్ణవేణి, చంద్రకళ, రెడ్డెమ్మ, అమ్మాజీ, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

పీలేరు : తల్లి పాలు బిడ్డకు ఓ వరమని, తల్లి ముర్రుపాలను మించిన పౌష్టికాహారం లేనే లేదని, వాటిలో ఉండే పోషక విలువలతో శిశువులకు సంపూర్ణఆరోగ్యం చేకూరుతుందని తలపల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తలపల పీహెచ్‌సీ పరిధిలోని తలపల గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కృష్ణయ్య, ఏఎన్ఎం నాగవేణి, ఆశా, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

అమృతంతో సమానం

మదనపల్లె : పసి బిడ్డలకు తల్లిపాలు అమృతంతో సమానమని మెడికల్ కాలేజ్ సూపరిండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల వాల్ పోస్టర్లను జిల్లా ఆస్పత్రిలో వైద్య అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు తప్పనిసరిగా కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. బిడ్డలకు పాలు ఇవ్వడం ద్వారా మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ జమున, ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మాంజలి దేవి, వైద్యులు మస్రూర్, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.